సాక్షి
మెదక్
శనివారం । 25 । మే । 2024



ఇంటి నంబర్లు 'ఫేక్'
కొందరు దొంగ తక్‌పట్టీలు సృష్టించారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి శివారులో స్థలంలో ఇల్లు లేకున్నా ఉన్నట్లుగా 59 జీఓకు దరఖాస్తు చేశారు. వివరాలు 8లో ▸



తల్లిదండ్రులకు గుడి
తల్లిదండ్రులకు గుడి కట్టారు. గుడిలో విగ్రహాలను ప్రతిష్ఠించి నిత్యం పూజలు చేస్తున్నారు తనయులు. వివరాలు 8లో ▸



మండుటెండలో నిండుగా నీరు
భూగర్భజలాలు అడుగంటి పోతున్న తరుణంలో పురాతన చేతబావిలో నేటికీ నిండుగా నీరు ఉంది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

హక్కుల సాధనకు ఉద్యమిద్దాం


మాట్లాడుతున్న అడివయ్య

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగుల సంక్షేమాన్ని పాలకులు విస్మరించారని, హక్కుల సాధనకు సిద్ధం కావాలని ఎన్‌పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆయన మాట్లాడారు. మోదీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని, నిత్యావసరాల ధరలు ఆకాశనంటాయని వాపోయారు. దేశంలో దివ్యాంగులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను రద్దు చేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. జూలై 21, 22 తేదీల్లో జిల్లాలో 7వ మహాసభలు జరుగుతాయని ఎన్‌పీఆర్డీఓ గౌరవ జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు యశోద, ఉపాధ్యక్షులు చంద్రం, శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు చింతకుంట శ్రీనివాస్, సంతోష్ కుమార్, నాయకులు శ్రీనివాస్, కిష్టయ్య, చంద్రమ్మ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి


మాట్లాడుతున్న ఏడీఏ పుణ్యవతి

కౌడిపల్లి(నర్సాపూర్): విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు లాట్ నంబర్ ఉన్న బిల్లులు ఇవ్వాలని ఏడీఏ పుణ్యవతి తెలిపారు. శుక్రవారం కౌడిపల్లిలో ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీలర్లు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని చెప్పారు. రైతు పేరు, స్టాక్ వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయడంతో పాటు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. రైతులు లూజ్ విత్తనాలు కొనుగోలు చేయవద్దని, ప్రభుత్వ గుర్తింపు ఉన్న డీలర్ల వద్ద మాత్రమే కొనాలన్నారు. విత్తనాలు మొలకెత్తకపోయిన, ఇతర నష్టం వచ్చిన నష్టపరిహారం తీసుకునేందుకు బిల్లులు అవసరం ఉంటాయని తెలిపారు. శనివారం నుంచి గ్రామాల్లో రైతులకు పంటల సాగు, విత్తనాల ఎంపికపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏఓలు స్వప్న, శ్వేతకుమార్, ఏఈఓలు, డీలర్లు పాల్గొన్నారు.

మొదటి రోజు 95 శాతం హాజరు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు డీఐఈఓ సత్యనారాయణ తెలిపారు. ఉదయం మొదటి సంవత్సర విద్యార్థులకు తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. జనరల్‌లో 959 మందికి గాను 914 మంది, ఒకేషనల్‌లో 29 విద్యార్థులకు 28 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. 339 మందికి గాను 318 విద్యార్థులు, ఒకేషనల్‌లో 43 గాను 43 విద్యార్థులు హాజరైనట్లు వెల్లడించారు. మొత్తంగా విద్యార్థుల హాజరుశాతం 95గా నమోదైందని.. పరీక్ష కేంద్రాలను అధికారులు సందర్శించారని వివరించారు.

ప్రశాంతంగా పాలిసెట్


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ సువర్ణలత

మెదక్ కలెక్టరేట్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్) జిల్లాలో శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. మెదక్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఆదర్శ జూనియర్ కళాశాల, సిద్ధార్థ్ మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను జిల్లా కోఆర్డినేటర్, మెదక్ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సువర్ణలత పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొత్తం 1,590 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1,462 మంది హాజరైనట్లు తెలిపారు. 92 శాతం హాజరు నమోదైనట్లు చెప్పారు.

ఫీ'జులుం'

ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం

మెదక్‌జోన్: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీకి గురిచేస్తున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో జిల్లాలో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది.

జిల్లాలో 220 ప్రైవేట్ బడులు


అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 220 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 70 వేల పైచిలుకు విద్యార్థులు చదువుకుంటున్నారు. పట్టణంలోని ఓ పాఠశాలలో నర్సరీకి ఫీజు రూ.19,000, అడ్మిషన్ ఫీజు రూ.1,000, షూ, యూనిఫాంకు కలిపి రూ.5 వేలు మొత్తంగా రూ.25,000 వసూలు చేస్తున్నారు. ఎల్‌కేజీకి ఫీజు రూ.28,000, యూకేజీ రూ.29,500, 6వ తరగతికి రూ.36 వేలు, 7వ తరగతి రూ.40 వేలు, 10వ తరగతికి రూ.62 వేలు తీసుకుంటున్నారు. ఇవి కాకుండా అదే పాఠశాలలో హాస్టల్‌లో ఉంటే ఏడాదికి రూ.40 వేలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారు.

అమలు కాని విద్యాహక్కు చట్టం!

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు వసూలు చేయొద్దు. కానీ జిల్లాలో రూ. వెయ్యి నుంచి మొదలుకుని రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నారు. అంతేకాకుండా ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం పేద పిల్లలకు ఉచితంగా విద్య అందించాలనే నిబంధన ఉంది. దానిని అమలు చేసిన దాఖలాలు లేవు. 2020లో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని అప్పటి ప్రభుత్వం జీఓ జారీ చేసింది. అయినా అది ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. అంతేకాకుండా యూనిఫామ్స్, పుస్తకాలు, షూ ఎట్టి పరిస్థితుల్లో పాఠశాలల నిర్వాహకులు విక్రయించొద్దనే నిబంధన ఉంది. అయినా ఇవేమి పట్టించుకోవడం లేదు. ఏకంగా పాఠశాలల్లోనే విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ఇటీవల పలు సంఘాల నాయకులు అదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అన్నివర్గాల పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

చర్యలు తప్పవు

ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం కమిటీ వేస్తామని చాలాకాలంగా చెబుతోంది. ఈ ఏడాది సైతం ఆ అంశం ప్రస్తావనకు వచ్చింది. ప్రైవేట్ పాఠశాలలు విద్యాహక్కు చట్టం ప్రకారం నడుచుకోవాలి. లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవు.
– రాధాకిషన్, డీఈఓ, మెదక్



కొనుగోళ్లు వేగవంతం చేయండి

జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరీ


అధికారులతో మాట్లాడుతున్న భారతి హోళికేరీ

నర్సాపూర్ రూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నర్సాపూర్ మార్కెట్‌తో పాటు మండలంలోని కాగజ్ మద్దూర్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అదనంగా లారీలను ఏర్పాటు చేసి రైస్ మిల్లులకు ధాన్యం తరలించాలని సూచించారు. ధాన్యంలో తేమశాతం లేకుండా తూకం వేయాలన్నారు. రైతుల వద్ద నుంచి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి రోజు కొనుగోలు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. కాగజ్ మద్దూర్ కొనుగోలు కేంద్రంలో 8,000 వేల ధాన్యం బస్తాలు పేరుకుపోయాయని.. మూడు రోజులకు ఒక లారీని పంపుతున్నారని రైతులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అదనంగా లారీలను పంపించాలని మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎస్‌ఓ బ్రహ్మారావు, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి ఆర్‌ఐ సిద్ధిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్


రెడ్డిపల్లి కాలనీ ప్రాథమిక పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

చేగుంట(తూప్రాన్): అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చేగుంట బాలుర ప్రాథమిక పాఠశాల, రెడ్డిపల్లి కాలనీ ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులను డీఈఓ రాధాకిషన్‌తో కలిసి పరిశీలించారు. పాఠశాలల్లో జరుగుతున్న విద్యుత్ పనులు, నీటి సరఫరా, మరుగుదొడ్ల పరిస్థితులపై ఆరా తీశారు. పాఠశాలల ప్రారంభం నాటికి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సౌకర్యాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. అన్ని గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణపై నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వడియారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కొనుగోళ్లు పూర్తయ్యే వరకు కొనుగోలు కేంద్రం మూసివేయవద్దని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ గియాసున్నీసాబేగం, ఎంపీడీఓ చిన్నారెడ్డి, ఎంఈఓ బుచ్యానాయక్‌తో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

పురాతన కట్టడం పరిశీలన

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ మండలం కొంటూరులో పురాతన మసీదును కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. క్రీస్తు పూర్వం 500 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కట్టడానికి చిన్న చిన్న మరమ్మత్తులు చేయాలని స్థానికులు సూచించగా.. పురావస్తు, వక్ఫ్‌బోర్డ్ అధికారులతో సంప్రదించి తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని వాపోయారు. ఎరువులు, విత్తనాలు దొరకడం లేదన్నారు. సకాలంలో తూకం వేయకపోవడంతో ధాన్యం తడిసిందన్నారు. తరుగు పేరిట బస్తాకు నాలుగు నుంచి ఆరు కిలోల ధాన్యం తీసుకుంటూ రైతులను నష్టాలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నిరకాల వడ్లకు బోనస్ ఇవ్వాలన్నారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు వెంట వెంటనే డబ్బులు అందేలా చూడాలని అధికారులకు సూచించారు. వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో రైతులు ఏనాడు ఇబ్బంది పడలేదని గుర్తుచేశారు. రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకుల్లో రైతులకు రుణాలు లభించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, నాయకులు సత్యంగౌడ్, జితేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన మేళాకు రైతులు


ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతులు

మెదక్‌జోన్: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను జిల్లా రైతులు సందర్శించారని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 21 మండలాల నుంచి 30 మంది రైతులు మేళాకు హాజరయ్యారన్నారు. మేలైన వంగడాలు సాగుచేయాలని వ్యవసాయ విశ్వవిద్యాల యం నిర్ణయించిందన్నారు. 16 పంటల్లో 67 రకాలకు సంబంధించి దాదాపు 12 వేల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు విక్రయించేందుకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతపై రైతుల సందేహాలు తీర్చడానికి శాస్త్రవేత్తలతో చర్చాగోష్ఠి ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శన సైతం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

భూంపల్లి ఎస్‌ఐ సస్పెన్షన్

- ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ
- పలు కేసుల్లో అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారణ


ఎస్‌ఐ రవికాంత్

దుబ్బాక: భూంపల్లి ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న వి.రవికాంత్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం మల్టీజోన్–1 ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మెదక్ జిల్లాలోని శివ్వంపేట ఎస్‌ఐగా పనిచేసిన రవికాంత్ సిగిల్లాపూర్ మామిడి తోటలో జరిగిన దొంగతనం కేసులో, అలాగే పలు భూతగాదా కేసుల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు మెదక్ ఎస్పీ విచారణ చేయగా నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తూ ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా 4 నెలల క్రితమే శివ్వంపేట నుంచి బదిలీపై భూంపల్లికి ఎస్‌ఐగా వచ్చారు. ఇక్కడా ఆయన పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


చిన్నశంకరంపేటలో రోడ్డును శుభ్రం చేస్తున్న కార్మికులు

వేతన వెతలు!

పారిశుధ్య కార్మికులకు తప్పని తిప్పలు

చిన్నశంకరంపేట(మెదక్): ఆరు నెలలుగా వేతనాలు రాక పారిశుధ్య కార్మికులు అవస్థలు పడుతున్నారు. పస్తులుండి పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామని వాపోతున్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని చెబుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల పనులు నిలిపివేసిన కార్మికులు వేతనం కోసం మండల కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లాలో 1,710 మంది విధులు

జిల్లాలో 1,710 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ఒకొక్కరికి రూ.9,500 వేతనం చెల్లిస్తున్నారు. చిన్న పంచాయతీల్లో రూ.8,500 అందజేస్తున్నారు. జనాభాకు అనుగుణంగా ఒక్కో గ్రామంలో నలుగురి నుంచి ఎనిమిది మంది వరకు పనిచేస్తున్నారు. పారిశుధ్య పనులతో పాటు మురికి కాలువలు శుభ్రం చేయడంతో పాటు ట్రాక్టర్ ద్వారా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. మరో వైపు మొక్కలకు నీరు పెట్టడం, నల్లా నీరు వదలడం లాంటి పనులు చేస్తున్నారు. అయితే సకాలంలో వేతనాలు రాకపోవడంతో కొంత మంది కార్మికులు విధులకు హాజరు కావడం లేదు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. అధికారులు వెంటనే స్పందించి కార్మికులకు వేతనాలు అందించి పనులు సజావుగా సాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అప్పు చేయాల్సి వస్తోంది



సమయానికి వేతనం రాక అవస్థలు పడుతున్నాం. జీతం వస్తదని అవసరానికి అప్పు చేసి తిప్పలు పడుతున్నాం. గతంలో సర్పంచ్ ఉన్నప్పుడు చే బదులుగా ఇచ్చి జీతం వచ్చాక తీసుకునే వారు. ఇప్పుడు ప్రత్యేకాధికారిని అడగమంటున్నారు. సార్ రావడం లేదు జీతం ఫైనలు ఇవ్వడం లేదు.
– సావిత్రి, కార్మికురాలు, చిన్నశంకరంపేట

త్వరలో అందిస్తాం

పంచాయతీ సిబ్బంది వేతనాల గురించి ప్రభుత్వానికి తెలియజేశాం. ఒక వైపు ప్రభుత్వం మారడం, మరో వైపు ఎన్నికలు రావడంతో నిధులు డ్రా చేసేందుకు కొన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రభుత్వ అనుమతి కోసం వేచి చూస్తున్నాం. అనుమతి వచ్చిన వెంటనే పారిశుధ్య కార్మికులకు బకాయిపడిన మొత్తం ఒకేసారి చెల్లిస్తాం.
– యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి

ఇంటి నిర్మాణం.. మరింత భారం

● భారీగా పెరిగిన నిర్మాణ వ్యయం ● స్టీల్, ఇసుక, సిమెంట్ ధరలకు రెక్కలు ● పెరిగిన కూలీ రేట్లు ● బెంబేలెత్తుతున్న సామాన్య ప్రజలు

సామాన్యులకు సొంతింటి కల పెను భారంగా మారింది. రోజురోజుకూ నిర్మాణ సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతుండటంతో బెంబేలెత్తుతున్నారు. స్టీలు, సిమెంటు, ఇసుక, ఇటుక రేట్లు అమాంతం పెరిగిపోయాయి. ధరలను చూస్తే ఇంటి నిర్మాణం జోలికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. గతేడాదితో పోల్చితే రెండింతలు పెరిగాయి.
– జహీరాబాద్ టౌన్


జహీరాబాద్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న భవనం

ఇంటి నిర్మాణం పనులు మొదలు పెట్టాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. ముడిసరుకుల ధరలు పెరుగుతుండటంతో నిర్మాణ బడ్జెట్ అంచనాలు తారుమారవుతున్నాయి. అప్పు చేసినా ఇంటి నిర్మాణం పూర్తయ్యే పరిస్థితి కనబటం లేదని మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు. స్టీల్, సిమెంట్, ఇసుక, ఇటుక, పీవీసీ విద్యుత్, ప్లంబింగ్ మెటీరియల్, కలర్స్, కూలీ రేట్లు ఇలా ప్రతీ వస్తువు ధరలు భారీగా పెరిగాయి. వెయ్యి చదరపు అడుగుల ఇల్లు కట్టుకుంటే గతంలో కంటే అదనంగా ఐదారు లక్షల భారం పడుతోంది. నిర్మాణం పనులు ప్రారంభించిన వారు పెరిగిన ధరలతో సగంలోనే పనులు ఆపేస్తున్నారు. కొత్తగా సొంతింటి నిర్మాణం మొదలు పెట్టాలనుకునే వారు ధరలను చూసి సందిగ్ధంలోకి వెళ్లిపోతున్నారు.

ఇసుక రేట్లు డబుల్

ఇళ్ల నిర్మాణంలో ఇసుకకు ప్రాధాన్యం ఎక్కువ. వీటిలో రెండు రకాలు ఉంటాయి. కట్టడానికి ఉపయోగించే ఇసుక టన్నుకు రూ.2800 వరకు పలుకుతోంది. ప్లాస్టింగ్‌కు వాడే సన్నరకం ఇసుక టన్నుకు రూ.3 వేల నుంచి రూ.3500 వరకు అమ్ముతున్నారు. గత సంవత్సరం ఇసుక రేటు టన్నుకు రూ. 1300 ఉండగా ప్రస్తుతం డబుల్ అయ్యింది. ఇసుక కొరతతో పాటు ఓవర్ లోడ్‌కు అనుమతులు ఇవ్వకపోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. పునాదులు, స్లాబ్‌కు ఉపయోగించే కంకర ధర కూడా పెరిగింది. టన్నుకు రూ.1500 నుంచి రూ. 2,500 వరకు విక్రయిస్తున్నారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, టైల్స్, కలర్, కిటికీలకు ఉపయోగించే యూపీవీసీ, కలప తదితర వస్తువుల ధరలు కూడా 25 నుంచి 30 శాతం వరకు పెరిగాయని వాపోతున్నారు. పెరిగిన ధరలతో కాంట్రాక్టర్లు కూడా ఆందోళన చెందుతున్నారు. అగ్రిమెంట్ చేసుకున్న సమయంలో ఉన్న ధరలు ప్రస్తుతం ఉన్నవాటికి చాలా వ్యత్యాసం ఉండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. పేదలు ఇల్లు కట్టుకోవాలంటే ధరలను నియంత్రించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.

ఆకాశాన్నంటుతున్న ధరలు

కొవిడ్ తరువాత ప్రతి ఒక్కరికీ సొంత ఇంటి అవసరం పెరిగింది. అద్దెలు కట్టలేక తమకు ఉన్న స్థలాల్లో నిర్మాణాలు మొదలు పెడుతున్నారు. అప్పటి నుంచి మొదలైన ధరల మోత ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఒక్కసారిగా లేబర్ చార్జీలు పెరిగాయి. ఆ తరువాత మిగతా ముడి సరుకుల ధరలకు రెక్కలు వచ్చాయి. సొంతంగా దగ్గరుండి ఇల్లు కట్టించుకుంటే గత సంవత్సరం చదరపు అడుగు రూ.1400 నుంచి రూ.1500 వరకు ఖర్చు అయ్యేది. అదే కాంట్రాక్టుకు ఇస్తే రూ.1600 నుంచి రూ.1700 వరకు వ్యయం చేయాల్సి వచ్చేది. ఇంటీరియర్స్‌కు అదనం. ప్రస్తుతం పెరిగిన ధరలతో సొంతంగా ఇల్లు కట్టించుకున్నా రూ.1800 నుంచి రూ.1900 వరకు అవుతుండగా, కాంట్రాక్టుకు ఇస్తే రూ. 2000 నుంచి రూ.2200 వరకు తీసుకుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఇసుక టన్ను ధర రూ.2800 వరకు పలుకుతోంది. స్టీల్ టన్ను రూ. 60 వేలకు పెరిగింది. సిమెంట్ ధరలు బస్తాకి కంపెనీ బట్టి రూ. 360 వరకు ఉంది. కూలీల రేట్లు కూడా విపరీతంగా పెరిగాయి.

క్లుప్తంగా

లభించని ఆచూకీ

వెంకటేశం కోసం ముమ్మరంగా గాలింపు

కల్హేర్‌(నారాయణఖేడ్‌): గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్‌ చేసిన మల్లోడ్డి వెంకటేశం ఆచూకీ లభించలేదు. శుక్రవారం నారాయణఖేడ్‌ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, కల్హేర్‌ ఎస్‌ఐ వెంకటేశం, ఎస్‌బీ, స్పెషల్‌ పార్టీ పోలీసులు రంగంలోకి దిగారు. కామారెడ్డి జిల్లా పెద్దకోడప్‌గల్‌ వద్ద దొరికిన సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా వెంకటేశంను తరలించిన వాహనం డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వెంకటేశంను జుక్కల్‌ సమీపంలో ఓ ఫాంహౌస్‌లో విడిచినట్లు డ్రైవర్‌ చెప్పిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో మహారాష్ట్రలోని దెగ్లూర్‌, తదితర ప్రాంతాల్లో గాలించారు. అనుమానిత వ్యక్తికి సంబంధించిన సెల్‌ఫోన్‌ సిగ్నల్‌ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

రేషన్‌ బియ్యం పట్టివేత

గజ్వేల్‌రూరల్‌: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన శుక్రవారం గజ్వేల్‌ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తుర్కపల్లి మండలం దయమండ తండాకు చెందిన వంకోదాత వెంకటేశ్‌, వంకోదాత చిన్నలు పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు రేషన్‌ బియ్యాన్ని కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించేందుకు ట్రాలీ ఆటోలో తీసుకెళ్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు రైడ్‌ చేసి ట్రాలీ ఆటోలో ఉన్న 20 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

9 ట్రాక్టర్లు, జేసీబీ సీజ్‌

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తున్న వాహనాలను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌, కోహెడ పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. మండలంలోని కూరెల్ల గ్రామంలోని పెద్ద చెరువు నుంచి శుక్రవారం తెల్లవారుజామున ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన తిప్పారపు నవీన్‌చారి ఇటుక బట్టీలకు మట్టిని తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచరం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి 9 ట్రాక్టర్లతో పాటు జేసీబీలను పట్టుకున్నట్లు తెలిపారు.

ఐదుగురిపై కేసు

కొండపాక(గజ్వేల్‌): భూతగాదా విషయంలో దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్‌ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కొండపాక మండలంలోని దోమలోనిపల్లికి చెందిన అబ్బు కనకవ్వ, మరిది అబ్బు క్రిష్ణమూర్తిలకు ఒకే శివారులో వ్యవసాయ భూమి ఉంది. అబ్బు కనకవ్వకు చెందిన వ్యవసాయ భూమిని క్రిష్ణమూర్తి కుటుంబీకులు శుక్రవారం ట్రాక్టర్‌తో దున్నుతున్నారు. మా భూమిని ఎందుకు దున్నుతున్నారని కనకవ్వ అడగడంతో మీ భూమి ఎక్కడిదంటూ బూతు మాటలు తిడుతూ దాడికి పాల్పడ్డారు. ఆమె కుమారులపై కట్టెలతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు ఫిర్యాదు మేరకు అబ్బు క్రిష్ణ మూర్తి, పిండి ఎల్లాలు, పిండి కవిత, అబ్బు యాదవ్వ, అబ్బు లింగంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిద్రలోనే డ్రైవర్‌ మృతి

చిన్నశంకరంపేట(మెదక్‌): నిద్రలోనే కంటైనర్‌ డ్రైవర్‌ మృతి చెందిన ఘటన నార్సింగి మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. వల్లూర్‌ జాతీయ రహదారి పక్కన ఓ దాబా వద్ద రాజస్తాన్‌కు చెందిన డ్రైవర్‌ మనోజ్‌కుమార్‌ (36) గురువారం రాత్రి భోజనం చేసి కంటైనర్‌లోనే పడుకున్నాడు. శుక్రవారం ఉదయం చూసేసరికి మృతి చెంది ఉన్నట్లు దాబా యజమాని బిష్‌నోమ్‌ మనిష్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అహ్మద్‌ మొహినొద్దీన్‌ తెలిపారు.

చేపలు పడుతుండగా..

కరెంట్‌ షాక్‌తో వ్యక్తి మృతి

తూప్రాన్‌: చేపల వేటకు వెళ్లి వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన మండలంలోని ఘనపూర్‌ గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. మనోహరాబాద్‌ మండలం వెంకటాపూర్‌ అగ్రహారం గ్రామానికి చెందిన గుడ్ల శ్రీశైలం (45) గ్రామ సమీపంలోని ఘనపూర్‌ గ్రామానికి చెందిన గౌతమ్మ చెరువులోకి చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలను విద్యుత్‌ వైరు సాయంతో పడుతుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇంటి నంబర్‌లు 'ఫేక్‌'

59 జీఓకు దరఖాస్తులు

- దొంగ తక్‌పట్టీలను సృష్టించిన పలువురు దరఖాస్తు దారులు
- జిల్లాలో 8వేల మంది క్రమ బద్ధీకరణకు దరఖాస్తు
- ఇంటినంబర్‌లు రికార్డుల్లో పరిశీలించకుండానే పలువురు అధికారులు ఆమోదం
- ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం





ఆ స్థలంలో ఇల్లు లేకున్నా ఉన్నట్లుగా దొంగ తక్‌పట్టీలు సృష్టించి 59 జీఓకు దరఖాస్తు చేశారు. సిద్దిపేట అర్బన్‌ మండలం మిట్టపల్లి గ్రామ శివారులో 4-47/5/ఏ, 4-47/5/బీ, 4-47/5/సీ, 4-47/5/డీ, 4-47/5/ఈ, 4-47/5/ఎఫ్‌ ఇంటి నెంబర్‌లు గ్రామ పంచాయతీ నుంచి జారీ చేయకున్నా.. కేటాయించినట్లు దరఖాస్తు చేశారు. తక్‌పట్టీలు దొంగవి సృష్టించి 59 జీఓ కోసం దరఖాస్తు చేశారు. ఇలా దొంగ తక్‌పట్టీలు ఒక్క మిట్టపల్లి పరిధిలోనే కాకుండా చాలా చోట్ల సృష్టించి ప్రభుత్వంను, అధికారులను తప్పుతోవ పట్టించి ప్రభుత్వ స్థలాలను క్రమబద్ధీకరించుకున్నారు. ఈ ఇంటి నంబర్‌లు జారీ చేయలేదని, రికార్డుల్లో లేదని మిట్టపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్‌ తెలిపారు.

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వ స్థలాల్లో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న వారికి స్థలాలను క్రమబద్ధీకరించేందుకు గత ప్రభుత్వం 58, 59 జీఓలను విడుదల చేసింది. ఇదే అదనుగా చేసుకొని కొందరు రియల్టర్లు, భూ కబ్జాదారులు ప్రభుత్వ భూములను అధికారుల సహకారంతో పాగా వేసి క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేశారు. ఎన్నికల ముందు అధికారులు ఎలాంటి పరిశీలన లేకుండానే అందరికీ క్రమబద్ధీకరించారు. దీంతో ప్రభుత్వ స్థలాలు భూ కబ్జాదారుల చేతుల్లో చేరిపోయాయి.

ఇంటి నంబర్‌ రికార్డుల్లో పరిశీలించకుండానే...

దరఖాస్తు దారుడు పేర్కొన్న ఇంటి నంబర్‌ గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ రికార్డుల్లో ఉందా లేదా అని పరిశీలించకుండానే పలువురు అధికారులు ఆమోదం తెలిపారు. అలాగే ఆ స్థలంలో దరఖాస్తు దారుడు ఇంటి నిర్మాణం చేశాడా లేదా అని సైతం పరిశీలించలేదు. విచారణలో భాగంగా ఇంటి ముందు దరఖాస్తు దారుడి ఫొటోను కూడా తీసుకోవాల్సిండగా ఇతరుల గృహాల వద్ద ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అధికారులు అప్‌లోడ్‌ చేశారు. పరిశీలనకు వెళ్లిన అధికారులు పలువురు కాసులకు ఆశ పడి ప్రభుత్వ నిబంధనలను తుంగలోతొక్కారని ప్రచారం జరుగుతోంది. ఇల్లే లేకుండా దొంగ తక్‌ పట్టీలు, ఇంటి నంబర్‌ను సృష్టించిన వారి దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 8,304 దరఖాస్తులు

ప్రభుత్వ స్థలాల్లో 2014 కంటే ముందు ఇంటి నిర్మాణం చేసుకున్న వారికి క్రమబద్ధీకరణ చేసేందుకు 58, 59 జీవోలను ప్రభుత్వం విడుదల చేసి మార్చి 31, 2022 వరకు దరఖాస్తులను స్వీకరించారు. 4,196 మంది దరఖాస్తు చేశారు. మరోసారి జీఓను పునరుద్ధరించి జూన్‌ 2, 2020 వరకు ఇంటి నిర్మాణం చేసుకున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని అవకాశం కల్పించారు. మే 31, 2023 వరకు దరఖాస్తులు స్వీకరించగా 4,018 వచ్చాయి. 2020 జూన్‌ 2 వ తేదీ కంటే ముందు నిర్మించిన ఇంటి వివరాలు, ఇంటి పన్నులు, విద్యుత్‌ బిల్లు, కుళాయి పన్ను, స్థలం సంక్రమించిన తీరు, సర్వే నంబర్లు, వ్యక్తిగత గుర్తింపు పత్రాలు తదితర వాటితో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. వీటి పరిశీలనకు జిల్లా అధికారులను ఒక్కో మండలానికి కేటాయించి దరఖాస్తులను పరిశీలించి డిమాండ్‌ నోటీసులు జారీ చేశారు. మూడు దఫాల్లో రుసుమును చెల్లించే వెసులు బాటును కల్పించారు. 58 జీఓకు సంబంధించిన దరఖాస్తుల్లో 125 చదరపు గజాలలోపు స్థలంలో నిర్మాణాలు చేపడితే ప్రభుత్వం ఉచితంగానే క్రమబద్ధీకరించారు. 59 జీఓలో పరిధిలోకి 250 చదరపు గజాలలోపు ఉన్నవాటిని మార్కెట్‌ విలువలో 50 శాతం, 250 నుంచి 500 గజాలలోపు ఉన్న ఇళ్లకు 75 శాతం, అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉంటే వందశాతం రుసుము వసూలు చేశారు.

ఫేక్‌ తక్‌పట్టీల వెనుక ఓ స్థానిక ప్రజాప్రతినిధి

ఈ ఫేక్‌ తక్‌పట్టీల వెనుక ఓ స్థానిక ప్రజాప్రతినిధి ఉన్నట్లు తెలుస్తోంది. ఆ ప్రజాప్రతినిధి స్వయంగా ప్రింటింగ్‌ చేయించి చాలా మందికి ఇలా తక్‌పట్టీలు రాసి ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఒక్కో తక్‌పట్టీకి స్థలంను బట్టీ డబ్బులు వసూలు చేశారని తెలిసింది. ఇలా దొంగ తక్‌పట్టీలను సృష్టించి ఇచ్చారు.

చర్యలు తీసుకుంటాం

ఇంటి నిర్మాణం చేపడితేనే ఇంటి నంబర్‌ను గ్రామ పంచాయతీ కేటాయిస్తుంది. ఎవరైనా తప్పుడు తక్‌పట్టీలు ద్వారా ఇంటి నంబర్లు వేసుకుంటే చర్యలు తీసుకుంటాం. అవసరమైతే వారి పై క్రిమినల్‌ కేసులు సైతం పెడుతాం.

– దేవకి దేవి, డీపీఓ

మాచాపూర్‌లో హైనా కలకలం

రెండు దూడలు మృతి



మృతి చెందిన దూడ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్‌ హైనా దాడులు చేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం హైనా దాడిలో 65 జీవాలు మృతి చెందిన ఘటన మరువక ముందే శనివారం గ్రామానికి చెందిన రేగుల బాలయ్య, ఏదుల్ల మోహన్‌రెడ్డి పశువుల పాకలపై దాడి చేసి రెండు గేదె పిల్లలు (దూడలు)ను హతమార్చింది. దీంతో రైతులు బోరున విలపించారు. ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ బుచ్చయ్య అక్కడకు చేరుకొని పరిశీలించారు. ఈ ప్రాంతంలో రాత్రి బోన్‌లు, ఫ్లాష్‌ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

తల్లిదండ్రులకు గుడి కట్టిన తనయులు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): తల్లిదండ్రులకు గుడి కట్టారు. గుడిలో విగ్రహాలను ప్రతిష్ఠించి నిత్యం పూజలు చేస్తున్నారు తనయులు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన గొట్టె కొమురవ్వ-కనకయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. మూడేళ్ల క్రితం తల్లి చనిపోగా, ఏడాది కిందట తండ్రి మృతి చెందాడు. శుక్రవారం తండ్రి కనకయ్య మొదటి వర్ధంతి సందర్భంగా గుడిలో తల్లిదండ్రుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కుమారులు గొట్టె సదయ్య(వ్యవసాయం), మహేందర్‌(వ్యవసాయం), చిరంజీవి(ప్రైవేట్‌లో ఉద్యోగం)హైదరాబాద్‌లో చేస్తున్నాడు. తమను చిన్నప్పటి నుంచి కంటికి రెప్పలా చూసుకున్న తల్లిదండ్రులకు ఏదో ఒకటి చేయాలని భావించారు. ఈ క్రమంలోనే తమ వ్యవసాయ పొలంలో ప్రత్యేకంగా గుడి నిర్మించి అందులో తల్లిదండ్రుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. తల్లిదండ్రులకు గుడి కట్టి పూజిస్తున్న అన్నదమ్ములను చూసి గ్రామస్తులు ఎంతో గర్విస్తున్నారు. ఇలాంటి కొడుకలను కన్న ఆ తల్లిదండ్రులు అదృష్టవంతులని గ్రామస్తులు అంటున్నారు.



తల్లిదండ్రుల విగ్రహాలతో తనయులు

ప్రాణం తీసిన ఈత సరదా

నీట మునిగి బాలుడు మృతి



రోదిస్తున్న తల్లి ఉస్మాన్‌

నర్సాపూర్‌ రూరల్‌: సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన బాలుడు నీట మునిగి మృత్యువాత పడిన ఘటన నర్సాపూర్‌ మున్సిపల్‌ పరిధిలోని హనుమంతపూర్‌లో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. నర్సాపూర్‌ ఎస్సై పుష్పరాజ్‌, స్థానికుల కథనం మేరకు.. నర్సాపూర్‌ పట్టణానికి చెందిన చాంద్‌ పాషా, ఉస్మాన్‌ బీ దంపతుల కుమారుడు ఆసీఫ్‌(12) స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు హనుమంతపూర్‌ చెరువులోకి వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో ఆసీఫ్‌ నీట మునిగి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్‌ తెలిపారు.

మంజీరాలో మునిగి వ్యక్తి..

పాపన్నపేట(మెదక్‌): ప్రమాదవశాత్తు మంజీరాలో మునిగి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని రామతీర్థం శివారులో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్‌ కథనం మేరకు.. మండల పరిధిలోని జయపురం గ్రామానికి చెందిన బజారు కిష్టయ్య (35) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సమీప బంధువుల పెళ్లి నిమిత్తం రెండు రోజుల కిందట కుటుంబ సభ్యులతో కలిసి రామతీర్థం గ్రామానికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం స్నానం చేసేందుకు బంధువులతో కలిసి మంజీరానది వద్దకు వెళ్లాడు. అందరూ కలిసి స్నానం చేస్తుండగా కిష్టయ్య ప్రమాదవశాత్తు నీట మునిగాడు. అక్కడే ఉన్న బంధువులు గమనించి కాపాడేందుకు యత్నించినా సాధ్యపడలేదు. పోలీసులకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్ల సాయంతో నదిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య మమతతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

క్రైం కార్నర్‌

కారు బోల్తా.. ఒకరు మృతి

చిన్నశంకరంపేట(మెదక్‌): కారు అదుపు బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం టీ.మాందాపూర్‌ తండా-మెదక్‌ మండలం కాజీపల్లి గ్రామాల మధ్యలో చోటు చేసుకుంది. మెదక్‌ పట్టణ నవాబ్‌పేటకు చెందిన మేకల మహేశ్‌(32), అదే ప్రాంతానికి విజయ్‌కుమార్‌, పెరక రాజు, రాజు మెదక్‌ - చేగుంట ప్రధాన రహదారిపై వెళ్తున్నారు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డుపై పల్టీలు కొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రగాయాలతో మహేశ్‌ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. అదే సమయంలో అటు వైపు వస్తున్న జెడ్పీ చైర్మన్‌ హేమలతగౌడ్‌ విషయం గమనించి కారులో ఇరుక్కుపోయిన వారిని తన సిబ్బందితో పాటు భర్త శేఖర్‌గౌడ్‌ సాయంతో బయటకు తీశారు. వెంటనే మెదక్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న చిన్నశంకరంపేట పోలీస్‌లు వివరాలు నమోదు చేసుకున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

దుబ్బాకరూరల్‌: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఆరేపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై గంగరాజు కథనం మేరకు.. మండలంలోని గంభీర్‌ పూర్‌ గ్రామానికి చెందిన పర్స కనకయ్య (56) కూలి పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పని నిమిత్తం టీవీఎస్‌ ఎక్సెల్‌పై దుబ్బాకకు వచ్చి, తిరిగి వెళ్తున్నాడు. ఆరేపల్లి గ్రామ కమాన్‌ వద్ద నిజాంపేట మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందిన సాయి కిరణ్‌ రెడ్డి కారులో అతివేగంగా వచ్చి కనకయ్య ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కనకయ్యకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. కారు డ్రైవర్‌ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఓఆర్‌ఆర్‌పై మహిళను ఢీకొట్టిన కారు

పటాన్‌చెరు టౌన్‌: ఓఆర్‌ఆర్‌ పై మహిళను కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన బీడీఎల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. బీడీఎల్‌ సీఐ రవీందర్‌ రెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం పాటీ గ్రామ శివారులో నారాయణ కాలేజ్‌ సమీపంలో గుడిసెలు వేసుకొని ఉంటున్న మంగమ్మ ఓఆర్‌ఆర్‌ పై కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. శుక్రవారం ఉదయం డివైడర్‌ మధ్యలో పెరిగిన గడ్డిని తొలగిస్తుండగా, హైదరాబాద్‌ గచ్చిబౌలి వైపు నుంచి పటాన్‌చెరు వైపు వస్తున్న కారు మంగమ్మను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం హైటెక్‌ సిటీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి తరలించారు. గాయపడిన మంగమ్మ భర్త బోజియా ఫిర్యాదు మేరకు బీడీఎల్‌ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్‌, బైక్‌ ఢీ..

హుస్నాబాద్‌: ఆర్టీసీ బస్‌, బైక్‌ ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం హుస్నాబాద్‌ పట్టణ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కోహెడ మండలం రాంచంద్రాపూర్‌కు చెందిన దావ రాములు (42) హుస్నాబాద్‌ నియోజకవర్గం నవాబుపేటకు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో హుస్నాబాద్‌ పట్టణ శివారులోకి రాగానే కరీంనగర్‌ నుంచి హుస్నాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్‌ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాములుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

30 ఏళ్లకు ఆలయానికి ఉత్సవ విగ్రహాలు

నాచారం దేవాలయం నుంచి తరలింపు

జోగిపేట(అందోల్‌): చారిత్రాత్మకమైన అందోలులోని శ్రీ రంగనాథ ఆలయానికి చెందిన పంచలోహాలకు చెందిన ఉత్సవ విగ్రహాలు ఎట్టకేలకు 30 ఏళ్ల తర్వాత శుక్రవారం ఆలయానికి చేరుకున్నాయి. సంగారెడ్డి జిల్లా అందోలులోని రంగనాథ దేవాలయానికి చెందిన శ్రీకృష్ణుడు, రుక్మిణీ, సత్యభామ, నాలుగు ఆల్వార్ల విగ్రహాలు, తదితర పూజా సామగ్రిని 1992వ సంవత్సరంలో అప్పటి పూజారులు ఈ విగ్రహాలకు ప్రతి రోజూ పూజా కార్యక్రమాలు, రక్షణ విషయంలో ఇబ్బందులుగా ఉన్నాయని తెలిపారు. గ్రామానికి చెందిన పెద్ద మనుషుల సమక్షంలో నాచారంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ అధికారులకు అప్పగించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ విషయాన్ని తెలుసుకొని విగ్రహాలను యథావిధిగా అందోలు దేవాలయానికి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఈనెల 25వ తేదీ నుంచి ఆలయంలో ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో ఈ ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించాలన్నదే మంత్రి ఉద్దేశ్యమని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ఆలయంలో ఉత్సవ విగ్రహాలు

పేద విద్యార్థుల అభివృద్ధికి కృషి



సర్టిఫికెట్లతో విద్యార్థులు, శిక్షణ శిబిరం నిర్వాహకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తెల్లాపూర్‌ నైబర్‌హూడ్‌ అసోసియేషన్‌ ఎడ్యుకేషన్‌ వాలంటరీ గ్రూప్‌ ఎంతో కృషి చేస్తుందని నైబర్‌హూడ్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ అన్నారు. శుక్రవారం నైబర్‌హూడ్‌ ఎడ్యుకేషన్‌ వాలంటరీ గ్రూప్‌ ఆధ్వర్యంలో తెల్లాపూర్‌ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్లాపూర్‌ నైబర్‌హూడ్‌ ఎడ్యుకేషన్‌ వాలంటరీ గ్రూపు ఆధ్వర్యంలో ఈ ఏడాది తెల్లాపూర్‌లోని మూడు ప్రభుత్వ పాఠశాలలో చదివే 120 మంది విద్యార్థులకు నల్లగండ్లలోని ఇంజనీరింగ్‌ స్కూల్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో అంతర్జాతీయ పాఠశాలలో చదివే 36 మంది విద్యార్థులు వీరికి విద్యాబోధన చేశారని వివరించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన కార్యక్రమ కన్వీనర్‌ కవిత జాలే, కో ఆర్డినేటర్‌లు కత్యాయని, రవి రమణకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మదన్‌, రామమూర్తి పాల్గొన్నారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

శివ్వంపేట(నర్సాపూర్‌): పదహారు రోజుల కిందట మృతి చెందిన వ్యక్తిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయడంతో శుక్రవారం పోలీసులు పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధి పోతులబోగూడ గ్రామానికి చెందిన కొంటి పోచయ్య(60) నీటికుంటలో పడి మృతి చెందడంతో సహజ మరణం అనుకొని కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. భూమి అమ్మకం విషయంలో పోచయ్య అడ్డొస్తున్నాడని నెపంతో రియల్‌ వ్యాపారులు హత్య చేశారని ఆరోపణలు వెలుగులోకి రావడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తూప్రాన్‌ సీఐ కృష్ణ నేతృత్వంలో పలువురు అనుమానితులను విచారించారు. శుక్రవారం తహసీల్దార్‌ శ్రీనివాస్‌చారి, ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి, గ్రామస్తుల సమక్షంలో పూడ్చిన శవాన్ని వెలికితీసి సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు అజారుద్దీన్‌ పోస్టు మార్టం నిర్వహించారు. పోస్టుమార్టం రిపోర్టుల ఆధారంగా మృతికి సంబంధించి నిజాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు తెలిపారు.



పోస్టుమార్టం చేయిస్తున్న పోలీసులు

గర్భిణితో అసభ్యంగా ప్రవర్తించిన ఉద్యోగి

విధుల నుంచి తొలగింపు

నర్సాపూర్‌: వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణితో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పని చేసే ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగి అసభ్యంగా ప్రవర్తించడంతో విధుల నుంచి తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన గర్భిణి శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి స్కానింగ్‌ కోసం కుటుంబ సభ్యులతో వచ్చింది. ఆస్పత్రిలో బ్లడ్‌ బ్యాంకు వద్ద అటెండర్‌గా పని చేసే ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగి అమీర్‌కు స్కానింగ్‌ విభాగం వద్ద పేషెంట్ల జాబితా రాసే పని అప్పగించారు. జాబితా రాస్తున్న అమీర్‌ కొందరిని స్కానింగ్‌ చేసే గదిలోకి రావాలని సూచించాడు. ఓ గర్భిణి గదిలోకి వెళ్లగానే ఆమెతో అమీర్‌ అసభ్యంగా ప్రవర్తించాడు. మహిళ అరుస్తూ బయటకు వచ్చి కుటంబీకులతో విషయాన్ని చెప్పింది. వెంటనే వారు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పావనికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై డాక్టర్‌ పావని మాట్లాడుతూ.. తమ ఆస్పత్రిలో ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి అమీర్‌ను విధుల నుంచి తొలగించామన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

భూ వివాదం పరిష్కారం కాకపోవడంతో..

జహీరాబాద్‌: భూ వివాదం పరిష్కారం కాకపోవడంతో మనస్తాపానికి గురై మొగుడంపల్లి మండలంలోని సజ్జారావుపేట తండాకు చెందిన రైతు కీరూ రాథోడ్‌ ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి అన్న జ్ఞానేందర్‌ కథనం మేరకు.. కీరు తండ్రి రాంచందర్‌ సూర్య, అతడి అన్న లక్ష్మన్‌ సూర్యల పేరిట 14 ఎకరాల భూమి ఉంది. ఇందులో 3 ఎకరాలు లక్ష్మణ్‌ అమ్ముకున్నాడు. మిగితా భూమి ధరణి మూలంగా రికార్డుల నుంచి మాయమైంది. వీరి ఉమ్మడి కుటుంబమే కబ్జాలో ఉన్నప్పటికీ ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్‌ కావడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతోపాటు 140 సర్వే నంబర్‌లో 1.20 ఎకరాల భూమి కీరు కుటుంబం పేరిట ఉంది. ఇందులో నుంచి 10 గుంటల భూమి తనకే వస్తుందని, పాలివారు మాత్రం వేధింపులకు గురి చేస్తూ పోలీసులను ఆశ్రయించి వత్తిడి చేస్తున్నారని మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయమై రూరల్‌ ఎస్‌ఐ ప్రసాద్‌రావు స్పందిస్తూ భూ వివాదం విషయాన్ని న్యాయస్థానంలో పరిష్కరించుకోవాలని, ఫిర్యాదు దారుడికి చెప్పినట్లు పేర్కొన్నారు. రైతు సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

నాణ్యమైన విత్తనాలతో దిగుబడులు

తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ శ్రీదేవి

సిద్దిపేటఅర్బన్‌: నాణ్యమైన విత్తనాలతోపాటు నేల రకాన్ని బట్టి విత్తనాలను ఎంపిక చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులతోపాటు ప్రతికూల పరిస్థితుల్లో తక్కువ నష్టాన్ని కలిగిస్తాయని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ ఎస్‌. శ్రీదేవి అన్నారు. శుక్రవారం సిద్దిపేట రూరల్‌ మండలం తోర్నాలలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా వరిలో దొడ్డు రకం, సన్న రకాలు, కందిలో దొడ్డు రకానికి సంబంధించిన విత్తనాలను ప్రదర్శించి విక్రయించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ ప్రతీ ఏడాది నేల భూసార పరీక్ష చేయించుకోవాలని, నేల రకాలను బట్టి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వివిధ రకాల విత్తనాలు పరిశోధన కేంద్రం వద్ద అందుబాటులో ఉంటాయని, అవసరం ఉన్న రైతులు విత్తనాలు కొనుగోలు చేయొచ్చని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్‌ మాట్లాడుతూ.. పచ్చి రొట్ట ఎరువులను సాగు చేసి దుక్కిలో కలియదున్నుకోవాలని, దీని వల్ల భూసారం పెరుగుతుందన్నారు. విత్తనాలు దొరకని వారు పెసర విత్తనాలు వేసుకోవచ్చని తెలిపారు. సిరిసిల్లలోని బీజేఆర్‌ అగ్రికల్చరల్‌ కాలేజీ అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ జీ. శ్రీదేవి మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు విత్తన మేళాను నిర్వహిస్తున్న వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలను అభినందించారు. రైతులు వివిధ పంటలలో పురుగు మందుల వాడకం, మానవ, పర్యావరణ వ్యవస్థపై పురుగు మందుల అవశేషాల ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు.



విత్తన సంచులు అందిస్తున్న, శ్రీదేవి, తదితరులు